# వరద

సాంబయ్యకు మెలకువ వచ్చింది.

రేడియమ్ డయల్ వాచీ చూసుకున్నాడు. రెండయింది. తనకు ఐదుకు మెలుకువ రావాలి! మూడు గంటల ముందు తెలివి రావడానికి కారణం!

అతను అట్టే ఆలోచించకుండా... ఆలోచించనవసరం లేకుండా కింద గుడగుడ శబ్దం వినిపించింది. చీకట్లో చూస్తే ఏం కన్పించలేదు. లైటేద్దామనుకుని నేల మీద కాళ్ళు పెట్టి లేచి నిల్చున్నాడు అంతే!

గుండె జల్లుమంది!

చల్లగా కాలి కింద నీళ్ళు పారుతున్నాయి!

మెదడు మొద్దుబారి పోతుండగా లేని సత్తువ తెచ్చుకుని గోడకున్న స్విచ్ ఆన్ చేశాడు.

అంధకారం!

బల్బు పోయినట్లుంది...

అస్సలు కరెంటే ఉన్నట్టు లేదు.

వెన్నులో చలి పుట్టుకు వచ్చింది. ఎటు కదిలినా మోకాలు లోతు నీళ్ళు తగులుతున్నాయి.

కిటికీ తలుపు తీసి బయటకు చూశాడు.

నీళ్ళు చప్పుడు!

మసక వెల్తురులో నల్లటి నీళ్ళు నిగ నిగలాడుతున్నాయి.

దూరంగా టార్చిలైట్లు...లారీలైట్లు... హారన్లు... ఇంకోవైపు అపారమైన జల ప్రవాహం... ఇంకో వైపు పక్కనున్న ఇళ్ళు కనిపించకుండా నల్లటి నీళ్ళు.

కాళ్ళు తడుస్తున్న నీళ్ళతో మొహం కడుకున్నాడు.

"ఒరే నారాయణా!" కేకపెట్టాడు...

నిశ్శబ్దం...మళ్ళీ... మళ్ళీ...ఇంకా పెద్దగా...అర్థమయ్యింది...నారాయణ లేడని...

తన్ను కాపాడ్డానికి ఆ నారాయణే రావాలని!

తను ఒక దిక్కు తెలియని క్లిష్ట పరిస్థితిలో చిక్కుకుపోయాడని...అర్థం చేసుకున్నాడు.

గదికున్న సైడ్ డోర్‌ను బలవంతంగా తెరిచాడు. జుయ్‌మంటూ మరిన్ని నీళ్ళు లోపలికి దుముకుతూ వచ్చాయి.

సాంబయ్యకు అర్థమయ్యింది...

హంద్రీకి వరద వచ్చింది!

అగ్గువగా వచ్చిందని నది ఒడ్డున స్థలం కొనుక్కుని వద్దంటున్నా వినకుండా ఇల్లు కట్టుకున్న దానికి మొదటిసారిగా అనుభవిస్తున్నాడు.

కర్నూలు చరిత్రలో వరదలు రావడం అరుదు! తుంగభద్రకు వచ్చినా-హంద్రీకి రాదని అతని నమ్మకం! కాని గాజుల దిన్నె ప్రాజెక్టు పుణ్యమాని హంద్రీకి వరద వచ్చింది.

అధికారుల అలక్ష్యం వలన చాలా మంది వరదలో చిక్కుపడి పోయారు.

సాంబయ్యకు నిద్ర మాత్ర వేసుకునే అలవాటుంది. ఆ రోజు కూడా వేసుకుని పడుకున్నాడు. లోపల గడియ పెట్టుకుని పడుకున్నాడు.

అతని ఆప్తులు...ఆత్మీయులు...వరద వచ్చినప్పుడు అతన్ని లేపడానికి ప్రయత్నించారు.

కానీ క్షణ క్షణానికి ఎక్కువవుతోన్న వరద ప్రవాహం, ప్రాణభయం...మధ్యలోనే అతని మానానికి అతన్ని వదిలిపెట్టి వారందరిని పారిపోయేట్టు చేశాయి.

సాంబయ్య టెలిఫోన్ దగ్గరికి వచ్చాడు. రిసీవర్ తీసి డయల్ చేద్దామని చూశాడు...డెడ్!

'ఉత్తప్పుడే సరిగా పని చెయ్యదు... వరదకు పని చేస్తుందా?' నిట్టూర్చాడు.

సాంబయ్య ఉన్నది గ్రౌండ్ ఫ్లోర్‌లో కాదు...ఫస్టు ఫ్లోర్! అంటే...కనీసం ఇరవై అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తూ ఉండాలి...మనసులో అంచనా వేసుకున్నాడు.

కొందరు ఇళ్ళ పైకి ఎక్కినట్టున్నారు....

తను ఏం చేయాలి? నీరు నడుం దాకా వచ్చేసింది! పైకి మెట్లు లేవు... డబ్బులు దండుగని కట్టించ లేదు పైకి ఎలా ఎక్కాలి?

అయినా ఈ వెధవలంతా తన్ని వదిలేసి ఎక్కడికి పారిపోయారు?

అవును తన సేఫ్ ఏమవుతుంది? అరే! దాంట్లో నగలు - నట్రా చాలా ఉన్నాయి... తను తినకుండా ఇంకొకళ్ళకి పెట్టకుండా నిల్వ చేసిన ధనం... చాలా ఉంది. ఏమవుతుంది?

నీళ్ళు... దాహం తీర్చే నీళ్ళు... శ్వాస తీయడానికి ఉరకలేస్తున్నాయి.

అతి కష్టం మీద రెండు కుర్చీలు లాక్కొచ్చాడు. కిటికీ పక్కన ఒకదాని మీద ఒకటి చేర్చి... కిటికీని పట్టుకుని అతి ప్రయాస మీద - సన్‌షేడ్ మీదకి పాకాడు. పిట్టగోడ పట్టుకుని పై డాబా మీదకు ఎగబాకాడు.

చుక్కలు విరగబూసాయి నింగి చెట్టుకు. దూరంగా లైట్లు కనిపిస్తున్నాయి. సిటీ బాగానే ఉన్నట్లుంది.

హంద్రీ పరవళ్ళు తొక్కుతున్నది.

రాజవిహార్ దగ్గర బ్రిడ్జి మీద రాకపోకలు స్థంభించిపోయినట్లున్నాయి.

ఇటు ఆనంద్ టాకీస్ కూడా మునక వేసినట్లుంది.

విపరీతమైన శబ్దంతో ప్రవాహం.... వివరం లేని కేకలు వినిపిస్తున్నాయి....

ఎవళ్ళు వాళ్ళు అంటున్నారు... తెప్పలు అంటున్నారు...

పెద్ద కేక... ఆర్తనాదం.....

ఎవరో పడవలో తప్పించుకోబోయి ప్రవాహంలో కొట్టుకుపోయినట్లున్నారు.

గజ ఈతగాళ్ళు కావును అరుస్తున్నారు.

ప్రకృతి విలయ తాండవం ఆపే శక్తి ఎవరికి మటుకు ఉంటుంది?

ఇంకా నయం! తనకు కొంచెం ముందస్తుగా తెలివి వచ్చింది....

ఇంట్లో కొడుకు నారాయణ, కోడలు సీతమ్మ, మనవడు బుజ్జిగాడు ఉన్నారు రాత్రి.... ఇప్పుడున్నారా? గుండెలో అలజడి!

భీమయ్య నౌకరుండాలి!

కింది పోర్షనులో అద్దెకు సుబ్బారావు ఫ్యామిలీతో ఉన్నాడు. ఏమయ్యాడో?

తమ యింటికి ఆనుకుని అయితే ఎవరూ ఇల్లు కట్టుకోలేదు... కొంచెం దూరంగా ... వాళ్లు ఏమయ్యారో?

కొంచెం దూరంగా వీధి చివర పెద్ద గుంపుంది... బహుశా అంతకు మించి లోపలకు రాలేకపోయినట్లు. ఇక... చిక్కుపడి పోయినవాళ్ళను ఎలా బయటకు తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లున్నారు.

తనకు ఈత వస్తే ఎంత బాగుండేది...

దూకి ఆ పాట్న ఈదుకుంటూ వీధిలోకి వెళ్ళిపోయేవాడు....

కింద చప్పుడవుతూ ఇల్లుంది....

తన ఇనప్పెట్టె?

డబ్బులు... నగలు?

కొంపదీసి దొంగలు దోచుకోరు కదా!

బోర్లా పడుకొని... కిందకు తొంగి చూశాడు. ఏమీ కనిపించలేదు...

సాంబయ్యకు అప్పుడు అనిపించసాగింది.... దేవుడున్నాడు అని!

ఇంత యిదిగా బ్రతికి తను ఇంత నీచంగా చచ్చిపోవలసిందేనా? కడుపు కట్టుకుని... ఇతరుల కడుపు కొట్టి.... పరాయి తల్లుల మంగళ సూత్రాలు తాకట్టు పెట్టుకుని... వడ్డీ దగ్గర కనికరం చూపించకుండా.... ముక్కు పిండి వసూలు చేసిన డబ్బు ఏరు పాలు కావలిసిందేనా?

తన కొడుకు నారాయణ, కోడలు సీతమ్మ, మనవడు బుజ్జి... తమ ప్రాణాలు దక్కించుకుని పారిపోయి ఉంటారు... బ్రతికితే.... తన ఆస్తి అనుభవిస్తారు....

ఎంత కృతఘ్నులు!

తను ఏమైంది పట్టించుకోలేదు....

తను చచ్చాడో? బ్రతికాడో? వరదలో చిక్కుకుపోయాడని కొంచెం కూడ ఆలోచించలేదు... ముసిలాడన్న కనికరం లేకుండా తన్ను వదిలేసి పారిపోయారు.

హూ! ఈ వెధలవ కోసమా తాను తన జీవితాన్ని – తన సౌఖ్యాల్ని వెచ్చించి కూడ బెట్టింది!

తన యవ్వనాన్ని ధారపోశాడు..చచ్చి ఎక్కడుందో.... పార్వతి ఎప్పుడు ఏం కోరినా దాని ముచ్చట తీర్చలేదు....'డబ్బు విలువ నీకేం తెల్సే' అంటూ అంతా మూట కట్టాడు....

ఆమెకు ఆపరేషన్ చేస్తే బ్రతికేదేమో! కాని ఆ డాక్టరు నూటికి నూరు పాళ్ళూ గ్యారంటీ చెప్పలేదు. 'లక్ష ఖర్చు పెడితే... బ్రతకవచ్చు' అన్నాడు. లక్ష ఖర్చు పెట్టిం తర్వాత ..చస్తే!

లక్ష్మి పోఉంది...పార్వతి పోఉంది.

అందుకే తాను గుండె రాయి చేసుకుని, దేవుడి మీద భారం వేసి ఆపరేషన్ చేయించలేదు.

అయినా ఒక నెల ఎక్కువే బ్రతికింది డాక్టర్లు చెప్పిందాని కంటే... ఆ లక్ష ఇప్పుడు ఏమవుతాయి?

డబ్బుకున్న విలువ ఈ ప్రపంచంలో దేనికీలేదని తనకుతెల్సు... కాని నారాయణకు తెలియదు.

తనేదో తల్లిని చేతులారా చంపేసినట్లు, నారాయణ తనతో చాలాకాలం ముభావంగా ఉండేవాడు... సూటిపోటి మాటలు అనే వాడు.

ఏదైనా వాడిది ఖర్చు చెయ్యే!

ఎన్నోసార్లు హెచ్చరిక చేశాడు. లాభం లేకపోయింది. చివరికి సీతమ్మతో ముడివేస్తే సర్దుకుంది.

ఆమెది కాస్త వెనకా ముందూ చూసే స్వభావం!

దుబారా చెయ్యనివ్వదు.

ఆరోగ్యం పాడవుతుందని తనకీ రెండో సారి కాఫీ మానిపించేసింది.

తమకు మూడు గదులు చాలని కింద ఓ పోర్షన్ అద్దెకి చ్చేసింది!

కాకపోతే...పెళ్ళయిన తరువాత నారాయణ తన మాట కంటే ఆమె మాటకే ఎక్కువ విలువ ఇస్తున్నాడు - అది బాగోలేదు.

పండంటి మనవడు పుట్టిం తర్వాత కోడలంటే ఉన్న అసంతృప్తి కాస్త కొంచెం తగ్గింది.

ఎవరు నీళ్ళల్లో ఈత కొట్టుకొస్తున్నారో...

చీకట్లో కనిపించడం లేదు.

ఆ యింటికి కావును ఎవరో తాడు విసిరాడు! తాడు జారిపోయింది....

అరుపులు.. 'వద్దు-వద్దు' - అని...

'ఈ వరద అప్పుడే తగ్గదు... తాడు పట్టుకొని రావడానికి ప్రయత్నం చెయ్యండి' గాలివాటానికి మాటలు చెవిన పడుతున్నాయి.

'మాకు భయం- ఇక్కడే ఉంటాం...' ఆడవాళ్ళ గొంతులు...

'నీరు ఎక్కువైతే ఏం చేస్తారు?'

'ఛస్తే ఛస్తాం... మీకు దండం... వెళ్ళండి' సన్నగా ఏడ్పులు!

దూరాన ఉరుము ఉరిమింది...

తళుక్కున మెరుపు మెరిసింది...

సన్న తుప్పర పడుతున్నది...

కింద ఏదో చప్పుడు... గోడ కాబోలు కూలినట్లుంది. నదికి అడ్డంగా కట్టిన గోడ.... ప్రవాహానికి విరిగిపోయినట్లుంది.

సంకెళ్లు తెగాయి.

ఎందుకో శరీరంలో ఏవో ప్రకంపనాలు కనిపించాయి.... సాంబయ్యకు అవి అర్థం కాలేదు.. చిత్తభ్రమ అనుకున్నాడు.

తిరిగి కాళ్ళ కింద అలజడి!

సరిగ్గా... భూకంపం వచ్చినప్పుడు జరిగినట్లు జరజర ఏదో పాకుతున్నట్లు... అడుగులు తడబడ్డాయి.

ప్రవాహపు అల విసురుగా భవంతిని ఢీ కొట్టింది....

మళ్ళీ ఏదో జలదరింపు!

సన్నగా శబ్దం!

పెనుగాలికి వృక్షం ఊగినట్లు... ఆ ఇల్లు ఓ చిన్న కంపనం రుచి చూసింది. ప్రకంపనం! కంపం పట్టించింది సాంబయ్యకు.

ఏం జరుగుతున్నది? ఈ బిల్డింగు నిలుస్తుందా? కాంట్రాక్టరు ఈరణ్ణ దీన్ని సరిగ్గా కట్టాడా! ఇసక బస్తాలతో నింపేశాడా?!

చిన్న వరదలకు కూడ బ్రిడ్జిలు కొట్టుకుపోవడం సాంబయ్యకు కొత్త కాదు!

అంటే! తనున్న భవంతి కూడ పునాదులతో సహా.... పేకమేడలా కూలిపోనుందా?

చావు తనను సమీపించిందా?

మృత్యువు ఇంత నిర్దయురాలా?

మరణం ఈ తరుణంలోనా? దారుణం! దారుణం! ఆ౦! దారుణం!... రుణం! తను చేసింది నీచం - దారుణం - రుణం ఇవ్వడంలో దారుణంగా ఆలశ్యం చేశాడు... పాపం! ఊరుకుంధు భార్య చచ్చిపోయింది... ఆ రోజు తను మరిచిపోలేదు...

"దొరా! అర్జెంటుగా అప్పు కావాలి దొరా... మా ఆడుది ఆసుపత్రిలో ఉంది... నీ కాల్మొక్కుత్తా!" అశ్రు నయనాలతో అంజలి ఘటించి ఉరుకుంధు నిల్చున్నాడు.

ఉరుకుంధు అప్పుడప్పుడు ఆ యింటికొచ్చి సాంబయ్య చెప్పే చిన్నా చితక పనులు చేసి

పెడుతూ ఉంటాడు. అందుకు బదులుగా పెట్టిన అన్నం తిని – నాలుగు డబ్బులు తీసుకుపోతూ ఉంటాడు. వాడిది దగ్గరలో ఉన్న పల్లె!

"నీ పెళ్ళానికేమైందిరా?" నిదానంగా అడిగాడు సాంబయ్య.

"అయిపోయింది దొరా... బిడ్డ అడ్డం తిరిగినాడంట... కోసి... ఆ బిడ్డను తియ్యాలంట దొరా... లేకపోతే... యిద్దరికి పెమాదమట!" ఏడుస్తూ చెప్పాడు.

"ఎంత కావాలిరా?"

"ఐదేలు అవుతుందట... చచ్చి మీ కడుపున పుడతా!"

"ఔ దొరా! మందులు కావాలిట! డాక్టరు బాబుకు యివ్వాలిట! అది అరిజంటుగా జరిగిపోవాలిట!"

"సరే... మరి ఎలా తీరుస్తావురా?"

"కష్టం చేస్తాకదా దొరా... ఏడాదికింతని తీర్చేస్తా దొర... రెండెకరాల మెట్ట ఉంది..." ఉరుకుందు చెప్పాడు.

"మరి పొలం పట్టా తెచ్చావుట్రా!"

"దేనికి దొర...?"

"అదే! తాకట్టు.. ప్రతి తలమాసిన వాడ్ని నమ్మి నేను యాపారం చేస్తే చివరికి మిగిలేది చెప్పే!"

"తవరు నాకు తెల్సుకదా దొరా!" ఆశ్చర్యపోయాడు.

"డబ్బు విషయాలు నిక్కచ్చిగా ఉండాలి... ఆ పట్టా పాసు బుక్కు పట్టుకురా... నీకు ఐదు రూపాయల ధర్మవడ్డీకి అప్పు యిచ్చేస్తా!"

"దొరా! రేపు తెస్తా... ముందు మా ఆడోళ్ళ పానం మీదకొచ్చింది... కనికరించు దొరా!" ప్రాధేయ పడ్డాడు. "దూరం పోవాలి దొరా! నాకు కాళ్ళు సేతులు అడ్డం లేదు".

"ఒరే ఉరుకుందూ! నువ్వు డబ్బు తీసుకుని ఉరికితే నేనేం చెయ్యాలి రా!" వ్యంగ్యంగా అన్నాడు.

"నిశానీ వేస్తా దొరా!"

"ఏం చేసుకోను.... అసలీ కులం తక్కువోళ్ళని నమ్మడానికి లేదని మాబాబు చెప్తూ ఉండేవాడు."

"దొరా ...తవరు కులస్తులు – మేం కులానికి కులం తక్కువోళ్ళమే కాని గుణానికి కాదు! దొరామాటంటే మాటే – ఉరుకుందు ఒక్కసారి చెప్పాడంటే పానం పోయినా పాటిస్తాడు దొరా!" ఉరుకుందు రోషంగా అన్నాడు.

"సరేలేరా! బంగారం పట్టుకురా! నీక్కాబట్టి అప్పిస్తా!"

ఉరుకుందు మొహంలో కొంచెం ఆశ తొంగి చూసింది – అంతలోనే నిరాశ కనిపించింది.

"దొరా !నా దగ్గర బంగారం లేద్దొర! నా పెళ్ళాం మెళ్ళో పుస్తెల తాడుంది దొర! అంతకు ముందు రెండుసార్లు అడిగితే యివ్వలా!" సంశయిస్తూ చెప్పాడు.

"పిచ్చోడా ! బంగారం అవసరానికి కాక పోతే యింకెందుకు?"

"అది పెళ్ళిలో వాళ్ళ పుట్టింటోళ్ళు పెట్టింది ....చస్తే తియ్యనంటుంది! ఒప్పుకోదు దొరా!"

"ఒరే ఉరుకుందు! అస్సలు నీ పెళ్ళాం స్పృహలో ఉందిరా! మెడలో పసుపు కొమ్మువేసేసి దాన్ని పట్టుకురా– అది నిద్రోతున్నప్పుడు." సలహా ఇచ్చాడు.

ఉరుకుందు ఏం కష్టాలు పడ్డాడో అయితే తెలీదు ఓ రెండు గంటల్లో వచ్చాడు మంగళ

సూత్రాలతో రెండు సవరల పైన తూగింది...

ఐదు రూపాయిల వడ్డీ కింద కొంత మినహాయించి నాలుగు వేల చిల్లర అతని కిచ్చాడు.

దానికే వాడు పొంగిపోయి సాష్టాంగ నమస్కారాలు చేసిపోయాడు!

వారం తిరక్కుండానే ఉరుకుందు కనిపించాడు. మొహం పీక్కుపోయి... జుట్టు రేగిపోయి....నిద్రలేని కళ్ళతో!

"ఏరా... మళ్ళీ కావాలా! అంతకు మించి రాదు!" కఠినంగా అన్నాడు తను.

"దొరా! అయిపోయింది... నా లచ్చిమి చచ్చిపోయింది. నువు దుడ్డులు రెండు గంటల ముందు యిచ్చి వుంటే బతికేది దొరా... డాక్టరు బాబు సెప్పాడు - ఆపరేషన్ ఆలశ్యమైపోయినదని! నా బతుకే ఆలశ్యమైపోయింది!" ఏడ్చాడు.

"ఛ! ఊర్కో! దానికలా రాసిపెట్టి ఉంది... ఈభూమ్మీద నూకలు చెల్లిపోయాయి! బిడ్డ బాగుందా! పాప - బాబా!" అడిగాడు సాంబయ్య!

"ఇంకెక్కడి బిడ్డ... కడుపులోనే ఊపిరాడకపోయింది దొరా! తల్లీ-పిల్లా-యిద్దరూ!" ఏడ్చాడు.

కాసేపటికి ఉరుకుందు తనొచ్చిన పని చెప్పాడు.

"నా లచ్చిమి తాళిబొట్టు యివ్వు దొరా! అది పోయింది. ఇదన్నా చూసుకుని బతుకుతా!"

"ఏం అప్పు తీర్చేస్తున్నావా?"

"లేదు దొరా... కావాలంటే నా పొలం కాగితం యిస్తా ఉంచుకో ... లచ్చిమి బంగారం యిచ్చెయ్యి దొరా!"

సాంబయ్య అనుమానంగా పొలం కాగితాల వంక చూశాడు... అది ఎక్కడుందో - ఎంత ధర పలుకుతుందో - అమ్మినా ఎవరు కొంటారో?

"చూడు ఉరుకుందు - పోయింది ఎలాగూ పోయింది- దానికోసం చేసిన అప్పు మటుకు ఎందుకుంటుంది... ఏదో రకంగా తీర్చెయ్యి... అవసరమైతే పొలం అమ్మో...తాకట్టు పెట్టో నా డబ్బు నాకు తీసుకురా... ఇచ్చేస్తా!"

ఉరుకుందు ఎంత బ్రతిమాలినా సాంబయ్య లొంగదల్చుకోలేదు.

ఉరుకుందు లాభం లేదనుకుని వెళ్ళిపోయాడు. వెళ్తూ వెళ్తూ అన్నాడు ఒక్కమాట!

"దొరా! కులం తక్కువోళ్ళని కనికరం లేకుండా మాట్లాడుతున్నవు కదూ! దేవుడంటూ ఉంటే... నీకు తగిన శాస్తి జరుగుతుంది... నా లచ్చిమికి అన్యాయం చేసిన వాడు బాగుపడ్డు... నిండా మునిగిపోతాడు జాగ్రత్త!"

"పోరా! పిల్లి శాపనార్థాలకు ఉట్లు తెగిపడవు! అందితే జుట్టు అందకపోతే కాళ్ళు!" ఛీత్కరించాడు.

'నిండా మునిగిపోతాడు!' అని ఉరుకుందు అని నెల కూడా కాలేదు... తను నిజంగానే మునిగిపోతున్నాడు. తను - తన బంగళా - తన అహంకారం - తన వంశం - తన డబ్బు - దస్కం - అంతా నిలువునా మునిగి పోతున్నారు! తన్ను రక్షించే వాళ్ళు ఎవరూ లేరా!

తన బీరువాలో కనీసం రెండు లక్షల నగదు ఉంది. తనను ఎవడైనా కాపాడితే వెంటనే లక్ష ఇచ్చేస్తాడు. లక్షంటే లక్ష! అవసరమైతే రెండూ యిచ్చేస్తాడు!

ప్రాణం కంటే విలువైనదా డబ్బు?

ఇంత ఇనప్పెట్టె ఉండి తననూ ఏమీ కాపాడలేక పోతున్నది. తనంటూ ఊపిరితో ఉంటే గదా... ఈ డబ్బులు అనుభవించేది.

నారాయణగాడు ఎందుకిలా చేశాడు?

పోనీలే... వంశమన్నా నిలబడుతుంది!

కాని వాడికి తెలియదుగా తను డబ్బులు ఎక్కడ ఎక్కడ మదుపు పెట్టిందీ... దాచిందీ...

చిన్నప్పుడు తనకు నీటి గండం ఉందన్నారు ఎవరో! నీళ్ళు లేని ఎడారి రాయలసీమలో నీటి గండం ఏమిటని తను నవ్వేశాడు!

దూరంగా కలకలం!

నీళ్ళల్లో దుముకుతున్నట్లు...

పెద్దగా అరుపులు... పెడబొబ్బలు!

పాపం! ఎవరో పోయినట్లున్నారు.

పెద్ద శబ్దం అయింది!

అటు చూశాడు!

అక్కడ ఉండాల్సిన రెండతస్తుల భవనం నీళ్ళల్లో ఒరిగిపోతున్నది... దానిమీంచి కొందరు నీళ్ళల్లోకి దూకుతున్నారు.

హే భగవాన్! కాసేపు తనిలా ఉంటే – తన గతీ అంతేనా!

'లావొక్కింతయు లేదు' బమ్మెర పోతన పద్యం దిమ్మెరపోయేలా గుర్తొచ్చింది!

ఎలాగూ చావడం ఖాయం – చివరి క్షణాల్లోనన్నా భగవంతుడ్ని తలచుకుందాం అనుకున్నాడు.

"నారాయణ! నారాయణ!" కొడుకు గుర్తుకొచ్చాడు.

ఛీ! ఆ ద్రోహి గురించి ఎందుకనుకోవాలి!

"రామా! రామా!"

రామావతరం ముగిసింది కదా! ఆయనకి తన పిలుపు వినిపిస్తుందో వినిపించదో! భక్తవశ్యుడు... అల్ప సంతోషి... భోళాశంకరుడ్ని పిలిస్తే పలుకుతాడేమో! శంకరా! శంభో శంకరా!

"ఓం నమఃశ్శివాయ!"

దబ్బుమని ఏదో పడ్డ శబ్దం అయింది...

భయం గుండెల్లో దడ పుట్టించింది...

చీకట్లో ఏదో లావుగా – కదులుతున్నది!

పాము! అయిపోయింది... తన పని యింతటితో అయిపోయింది...

అడుగు తీసి అడుగు వేద్దామంటే అది కాటు వేస్తుందేమోనని భయమేస్తున్నది....

"దొరా!" ఎక్కడ్నుంచో పిలుపు!

పాము! చేసిన పాపం ఊరికే పోతుందా?

"అది పట్టుకో దొరా!"

ఎవ్వరిదో గొంతు ఎక్కడో విన్నట్లుంది...

"ఉరుకుందును దొరా! ఆ తాడు పట్టుకో! నీకోసం తెప్ప తెచ్చా..." కింద నుంచి

అరుస్తున్నాడు.

సాంబయ్యకు పంచప్రాణాలు లేచి వచ్చాయి.

తన కోసం ఒక మనిషి వచ్చాడు - తన ప్రాణం రక్షించడానికి ఒక మనిషి వచ్చాడు...

డాబా మీంచి కిందకి వంగి చూశాడు.

"దొరా! ప్రవాహం ఎక్కువవుద్ది... ఆ తాడు దేనికన్నా కట్టేసి - నువ్వు దాంతో దాన్ని పట్టుకొని... ఈ తెప్పలోకి దిగు దొరా... నేను గట్టిగా పట్టుకుంటా...." ఉరుకుందు అరుస్తూ చెప్పాడు.

సాంబయ్యకు ఎక్కడలేని బలం వచ్చేసింది.

అది పాము కాదు తాడు- ఛీ! తన పిచ్చి!

ఆ తాడును తీసుకుని పిట్టగోడలోని రంధ్రానికి కట్టేశాడు.

కొంచెం ప్రయాసతో ఆ తాడును పట్టుకుని దిగనారంభించాడు. అలవాటు లేని పని! ఒంగని కాయం!

"జాగ్రత్త దొర - మెల్లగా -మెల్లగా..." ఉరుకుందు హెచ్చరిస్తున్నాడు- అంతలోనే...

ఉన్నట్లుండి... ఆ తాడు ఆ పిట్టగోడతో సహా కిందకు జారింది - సాంబయ్య బరువుమొయ్యలేక దభీలుమని సాంబయ్య కింద పడ్డాడు నీళ్ళల్లోకి. "చచ్చాన్రోయ్! ఉరుకుందూ! రక్షించు!" చావుకేక పెట్టాడు.

"అరే - దొరా - గాబరా పడమాకు - నే ఉన్నా"!

ఉరుకుందు తాడును గట్టిగా లాగి... ప్రవాహంలో కొట్టుకుపోతున్న సాంబయ్యకు చెయ్యి అందించాడు.

అతి ప్రయాస మీద సాంబయ్య తెప్పలోకి వచ్చి పడ్డాడు. అతని బరువుకు మేడకు తెప్పకు కట్టిన తాడు తెగింది.. రెక్కలొచ్చినట్టు తెప్ప ప్రవాహానికి కొట్టుకుపోసాగింది.

సాంబయ్య భయంతో ఉరుకుందును కౌగిలించుకున్నాడు.

"దొరా! తవరు... మమ్మల్ని పట్టుకో వచ్చా! మేం కులం తక్కువోళ్ళం - మమ్మల్ని ముట్టుకుంటేనే తవరు అంటు పడిపోతారు... దూరం.. దూరం దొరా!"

"ఒరేయ్! ఉరుకుందూ! నువ్వు దేవుడివిరా! దేవుడికి అంటేమిటిరా? అయినా ఒరే... ఇలా ఎవరి కోసం వచ్చావురా? నా కోసమేనా! నా కొడుకు కోడలు నన్ను రక్షించలేదు...." ఏడుస్తూ చెప్పాడు.

తెప్ప వరద నీటికి పరుగులెత్తుతున్నది. ఉరుకుందు నేర్పుగా చేతుల్తో.... తెడ్డుతో.... దాన్ని నడిపిస్తున్నాడు..కాని అది అతని అదుపులో ఉన్నట్టు లేదు.... ప్రవాహం నలభైకిలోమీటర్ల కంటే వేగంగా ప్రవహిస్తున్నది...

కొన్ని మీటర్లు దాటగలిగితే రోడ్డు అందుకోవచ్చు! కాని ఆ వరద భీభత్సం తెప్పని తనలో యిముడ్చుకుంది... ఆ జలశక్తి ముందు మానవ శక్తి ఎంత? అందునా సాంబయ్య ఇంకా షాక్‌లోనే ఉన్నాడు.

"ఒరే! నీ రుణం నేను ఎలా తీర్చుకోగల్నురా! " సాంబయ్య ఒగరుస్తూ అన్నాడు.

"దొరా నా లచ్చిమి తాళి నాకిచ్చేయండి దొరా!చచ్చి మీ కడుపున పుడతా! నాపొలం కాగితాలుంచుకోండి మీ దగ్గర ....నాకు లచిమి తీపి గురుతు కావాలి దొరా!" ఉరుకుందు ఆర్ద్రంగా చెప్పాడు.

సాంబయ్యకు కళ్ళు తిరిగాయి... కళ్ళ నీళ్ళు తిరిగాయి.

రెండు రోజుల తర్వాత గుమ్మంలో కనిపించిన సాంబయ్యను చూసి నారాయణ తెల్లబోయాడు.

"నాన్నా! నువ్వు బ్రతికే ఉన్నావా! సీతా ఎవరొచ్చారో చూడు!" లోపలికి కేకేశాడు కంగారుగా!

"మామయ్యగారూ - ఇన్నాళ్ళూ ఎక్కడికి పోయారు?" ఆశ్చర్యంగా కొంచెం నిరాశగా అడిగింది సీతమ్మ.

"దొర - నేను.... ఏట్లో కొట్టుకుపోయాం! ఎలాగో పానాలు రక్షించుకొని రాగలిగాం!" ఉరుకుందు వెనకనించి వస్తూ చెప్పాడు.

సాంబయ్య మౌనంగా తన గదిలోకి వెళ్ళాడు.

ఉరుకుందు నారాయణకు ఆరాత్రి జరిగిన సంఘటన చెప్పాడు.... తాము ఎంత దూరం కొట్టుకుపోయింది...ఎలా బ్రతికిందీ...

"ఉరుకుందూ! ఎందుకురా అవన్నీ ఇప్పుడు.. ఇదిగో నీ లచిమి బంగారు మంగళసూత్రం!" సాంబయ్య అందించాడు దాన్ని.

"దొరా! చచ్చి నీ కడుపున పుడతా! నా లచిమి మెళ్ళోంచి దొంగిలించా... అందుకే అది నా కందకుండా చచ్చిపోయింది." ఉరుకుందు కళ్ళెంబడి నీళ్ళు కురిశాయి.

"లచ్చిమి అదృష్టవంతురాలు! తన కోసం ఏడ్చే మొగుడ్ని కట్టుకుంది..." సాంబయ్య బాధగా అన్నాడు.

"దొరా! నా పొలం కాగితాలు తీసుకో దొరా! నీ అప్పు తీర్చింతర్వాత తీసుకుపోతా!" ఉరుకుందు చెప్పాడు.

"ఒరేయ్! ఈ పదివేలుంచరా!" జేబులోంచి నోట్ల కట్ట తీసిచ్చాడు.

ఉరుకుందు అవాక్కయి చూస్తున్నాడు.

"దొరా! ఎందుకు?"

"ఒరే! కులం తక్కువోడని నిన్ను నేను నమ్మలేదు. కానీ ఒకే కులంలో పుట్టి...నా బిడ్డలు...నన్ను వంచించారురా! నేను నమ్మి మోసపోయానురా! నా అపరాధానికి ప్రాయశ్చిత్తంగా ఈ డబ్బుతో ఏదన్నా మంచిపని చేసుకోరా!" సాంబయ్య తన రెండు చేతులతో నోట్ల కట్ట పెట్టి ఉరుకుందు రెండు చేతులు మూశాడు.

"నాన్నా! మీకు మతి పోయిందా! వాడ్ని ముట్టుకుంటున్నారా!" నారాయణ విస్తుపోయాడు.

"మామయ్యగారికి మతి చలించి నట్లుంది... డబ్బులు పారేస్తున్నారు... అంతా అంటమంగళం చేస్తున్నారు!" సీతమ్మ తన నిరసన తెలియజేసింది.

"నాకు మతి పోయింది...కాని...వరద నాకు మతి తెప్పించింది! కుల పిచ్చి- డబ్బు పిచ్చి నాకు ప్రాణభిక్ష పెట్టలేకపోయాయి! మానవత్వం మేలు చేసింది- "సాంబయ్య కళ్ళకుహంద్రీ వరదలొచ్చాయి!

"నాన్న! అసలు ఆ రాత్రి ఏం జరిగిందో తెల్సా!" నారాయణ ఆత్రంగా చెప్పబోయాడు.

సాంబయ్య ఒక వాడిచూపు వదిలాడు - అతని నోరు మూతపడిపోయింది.

కోడలు పిల్ల మటుకు కొడుకును అడ్డుకుంది.

"అదికాదు మావయ్యగారూ! ఎంత తలుపు కొట్టినా మీరు లేవలేదు... క్షణక్షణానికి నీళ్ళు

ఎక్కువవుతున్నాయి... కనీసం మమ్మల్ని అన్నా సురక్షిత ప్రాంతాలకు జేర్చి - మళ్ళీ వచ్చి మిమ్మల్ని తీసుకుపోదామని ఆయన అనుకున్నారు అంతే! మమ్మల్ని ఇలా రోడ్డు మీద వదిలేసి మీకోసం తను బయలుదేరారోలేదో... ఈలోగా వరద ఉధృతి పెరిగి పోయింది... మనిషి నిలువునా మునిగి పోయేలా నీళ్ళు వచ్చేశాయి... అయినా ఆయన మీ కోసం రాబోతుంటే... అందరూ ఆపేశారు" సీతమ్మ ఏడ్చింది... కళ్ళొత్తుకుంటూ...

నిర్లిప్తంగా చూశాడు సాంబయ్య.

"క్షేమంగా ఉన్న మేమంతా... మునిగిపోయిన మీకోసం - మీ లాంటి వారి కోసం ఎంతో చేశాం... ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశాం - కలెక్టర్‌కు ఫోన్‌చేశాం... పోలీసులనురప్పించాం.. ఆఖరికి సి. యమ్. క్యాడ ఫోన్ చేశాం!" నారాయణఆవేదనతో చెప్పుకుపోయాడు.

"కొందరం గజ ఈతగాళ్ళ కోసం కబురు చేశాం- బోట్ల కోసం - తెప్పల కోసం కబురు పంపాం!" సీతమ్మ అందించింది.

"కాని అనుకోని సంఘటనకు - నీటి ఉరవడికి అందరూ నిశ్చేష్టులై నిల్చుండిపోయారు.... ఎలాంటి సహాయక చర్య చేపట్టినా అది మీ ముప్పుకే అన్న నిర్ణయానికొచ్చాం... బిల్డింగు పై కప్పే మీకు సురక్షితం అని తీర్మానించాం!" నారాయణ చెప్పాడు రోషంగా - దోషిలాగా చూస్తున్న తండ్రికి.

"దొరా! అప్పుడు నే వచ్చా దొరా! పట్నంలో పని దొరుకుతుందని ఈమధ్య వచ్చా దొరా! సందడిగా ఉంటే - ఏంటని కనుక్కుంటే కొందరు ఈతగాళ్ళు కావాలని పరుగెడుతున్నారు... నాలుగు డబ్బులొస్తాయని నేనొచ్చా దొరా! వచ్చింతర్వాత తెల్సింది... మునిగిపోయిన ఇళ్ళల్లో మా దొర యిల్లుందని". ఉరుకుంద చెప్పాడు.

"ఉర్కుకుంద నీళ్ళల్లో దూకపోతే మేమే వద్దన్నాం!" సీతమ్మ చెప్పింది.

"అన్యాయంగా చస్తావురా అని ఆపాం!" నారాయణ చెప్పాడు.

"కాని దొరా! వీళ్ళ కళ్ళు కప్పి... అక్కడున్న తెప్పలోకి దూకి నీకోసం వచ్చా దొరా! తప్పు.. నీ కోసం కాదు దొరా - నా లచిమి మంగళ సూత్రం కోసం వచ్చా దొరా! నువ్వు బతక్కపోతే నా లచిమి బంగారం నాకెవరిస్తారు దొరా!" కళ్ళెంబడి నీళ్ళు కారుతూ వుంటే ఉరుకుంద అన్నాడు.

"రేయ్ ! ఉరుకుందా! ఎంత గొప్ప వాడివిరా! కులంలో గుణం ఉందనుకున్నా ఇన్నాళ్ళూ! కాని గుణం కులంలో లేదురా! గుణం ఉన్నవాడే గొప్పవాడురా! గుణం సర్వ జనీనం! నాలాంటి నీచ సంతానం దగ్గర అది ఉండదురా! నా దగ్గరున్న డబ్బు పిశాచాన్ని చూసి అది పారిపోయిందిరా!" సాంబయ్య ఏడుస్తూ కుప్పకూలిపోయాడు.

నారాయణ ఆత్రంగా దగ్గరికి వచ్చి లేవదీసి కుర్చీలో కూర్చోపెట్టాడు.

సాంబయ్య అతన్ని విదిలించేశాడు.

"ఛీ! దూరంగా ఉండు - మైల పడతావు!" కసిరాడు.

"నాన్నా!" తెల్లబోయాడు నారాయణ.

"మావయ్యా!" సీతమ్మ ఆశ్చర్యంగా అంది.

"ఒరే ఉరుకుందా! ఆ రాత్రి నేను నమ్ముకున్న నా వాళ్ళు కాపాడలేదు... నేను నమ్మి పెంచిన సేఫ్ నాకు స్కేఫ్టీని యివ్వలేదు. ఎంతో మమకారంతో పెంచాను... వీడికి కష్టం కలుగకూడదని - - అది చచ్చిపోయినా ఇంకో పెళ్ళి చేసుకోలేదు... వీడు వీడి పిల్లలు నా లాగా కష్టపడకూడదని -

కడుపుకొట్టుకొని... కంటికి రెప్ప వేయకుండా కూడబెట్టాను... కాని..." ఏడ్చాడు సాంబయ్య.

"నాన్నా! ఎందుకు ఏడుస్తావు? ఇప్పుడేమయిందని? నీకోసమే గదా మేమంతా బ్రతికింది! నీకేం తక్కువ చేశామనుకుంటున్నావు?" నారాయణ చిరాగ్గా అన్నాడు.

సాంబయ్య ఠక్కున ఏడ్పు ఆపాడు - ఒక్కసారి చుట్టూతా చూశాడు... టేబుల్‌పైన స్వీటు ప్యాకెట్లు.. పూల మాలలు.. సెంటు పరిమళాలు కనిపించాయి. ఏతావాతా ఆనందతాండవం కనిపించింది- ఆ ఇంటిలో!

"ప్రాణం లేని లచిమి తాళి కోసం ప్రాణం ఉన్న ఉరుకుంద ఉరుక్కుంటూ వచ్చాడు... కాని... ప్రాణాపాయంలో వున్న కన్న తండ్రి కోసం మటుకు నా కొడుకు రాలేక పోయాడు! తన్ని ఇంత వాడ్ని చేసిన తండ్రిని మటుకు వదిలేసి - నిన్నగాక మొన్న వచ్చిన పడుచు పెళ్ళాన్ని - నిన్న పుట్టిన చంటోడ్ని భుజాన వేసుకుని పారిపోయాడు నా కొడుకు!" సాంబయ్య అంటున్నాడు.

"వెర్రివరదకు మతిపోయి వెర్రి కూతలు కూస్తున్నాడు మీ నాన్న!" సీతమ్మ మూతి విరిచింది.

"ఒరే - ఇక మడిసికి గొడ్డుకు తేడా ఏంటిరా! ఎవడి సుఖం వాడు చూసుకుంటూ -ఎవడి తిండి వాడు తింటూ-ఇంకెవరి గురించి పట్టించుకోకుండా తిరుగుతూ ఉంటే - ఈ మనుషులు... మమతలు ఎందుకు? ఈ కట్టుబాట్లు ఎందుకు? ఈ లోకంలో ఈ ముసిలాడు ఎవరికీ అక్కర లేదా? మీరు చూపించే ప్రేమలు వట్టి కపటనాటకాలేనా? నేను ఒంటరివాడినేనా?" సాంబయ్య కుమిలిపోయాడు. ఉరుకుంద కళ్ళు తుడ్చుకున్నాడు.

నారాయణ తల వంచుకున్నాడు. సీతమ్మ లోపలికి వెళ్ళింది విసురుగా.

(రచన)

